క్లుప్తంగా

ఫెలోషిప్‌నకు రామస్వామి ఎంపిక



కేయూ క్యాంపస్: కాకతీయ విశ్వవిద్యాలయ బయోటెక్నాలజీ విభాగ విశ్రాంత ఆచార్యులు ఆచార్య ఎస్.రామస్వామి యునైటెడ్ కింగ్‌డంలోని ప్రతిష్ఠాత్మక రాయల్ సొసైటీ ఆఫ్ బయాలజీ ఫెలోషిప్‌నకు ఎంపికయ్యారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులు అందుకున్నట్లు రామస్వామి బుధవారం తెలిపారు. జీవశాస్త్రంలో చేసిన అత్యుత్తమ పరిశోధనలకు ఎంపికైనట్లు వెల్లడించారు. గతంలో రామస్వామి పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థల నుంచి అవార్డులు అందుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ అధ్యాపకుడిగా అవార్డు పొందాడు. పరిశోధనల నిమిత్తం అమెరికా, నెదర్లాండ్, బ్రెజిల్, శ్రీలంక దేశాలను సందర్శించారు,

అభినందనలు

హన్మకొండ: హనుమకొండ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థలో రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో రాణించిన క్రీడాకారులను బుధవారం తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఆంజనేయులు గౌడ్ అభినందించారు. వరంగల్ జిల్లాలోని సంగెం లో క్రీడాకారులకు కిట్ల పంపిణీ కార్యక్రమానికి బుధవారం జిల్లాకు వచ్చిన ఆయనను డీవైఎస్‌ఓ అశోక్‌కుమార్, డీఎస్‌ఏ కోచ్, క్రీడా విజేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. వివిధ క్రీడా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 5న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. గోపాల్‌పూర్, సరస్వతీనగర్, గోపాల్‌పూర్ ఎస్సీ కాలనీ, పోచమ్మగుడి, ప్రగతినగర్, లక్ష్మీనగర్, విజయనగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు ఆర్టీసీ ఉద్యోగుల త్యాగాల దినం

హన్మకొండ: ఆర్టీసీ ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు 55 రోజుల పాటు చేసిన సమ్మె సందర్భంగా ప్రాణత్యాగాలు చేసిన కార్మికులను స్మరించుకుంటూ ఈ నెల 5న త్యాగాల దినంగా పాటించాలని ఆర్టీసీ జేఏసీ నాయకులు సిహెచ్.రాచందర్, ఇ.వెంకన్న, శ్రీనివాస్, టి.ఎల్లయ్య, యుఆర్ కృష్ణ పిలుపునిచ్చారు. డిపోల వద్ద అమరుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించాలని కోరారు. వరంగల్ రీజియన్‌లోని అన్ని డిపోల్లో జేఏసీ నాయకులు త్యాగాల దినాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కంచె ఏర్పాటుకు తీర్మానం

హసన్‌పర్తి: వంగపహాడ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి కేటాయించిన భూమి చుట్టూ కంచె ఏర్పాటుకు సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. పాలకవర్గ అత్యవసర సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సొసైటీకి కేటాయించిన స్థలంపై చర్చలో ఓ గదితో పాటు కంచె ఏర్పాటు చేయాలన్నారు. కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సభ్యులు తీర్మానించారు. ఈ మేరకు తీర్మాన పత్రాలను డీసీఓ, స్థానిక పోలీసులు, రెవెన్యూ అధికారులకు అందించారు.

కాంగ్రెస్‌లో చేరిక



మడికొండ: పేద ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందాలంటే కాంగ్రెస్ ద్వారానే సాధ్యమని మాజీ డీసీసీబీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. బుధవారం గ్రేటర్ పరిధిలోని 64వ డివిజన్ ఉనికిచర్లకు చెందిన బీఆర్ఎస్‌కు చెందిన 50 మంది యువకులు టేకులగూడెంలోని జంగా నివాసంలో పార్టీలో చేరారు. రాఘవరెడ్డి వారికి పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

జన్మదిన వేడుకలు

హన్మకొండ : ఏకశిల విద్యా సంస్థల అధినేత డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని హనుమకొండ పెద్దమ్మగడ్డ సమీపంలోని స్వయంకృషి వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. ఏకశిల జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో అన్నదానంతో పాటు వృద్ధులకు పండ్లు, పాలు, గుడ్లు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ముచ్చ జితేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ సుధాకర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, రాజిరెడ్డి ఆశ్రమ నిర్వాహకురాలు శుభా సిబ్బంది పాల్గొన్నారు.

చేయూత

హసన్‌పర్తి: ఇటీవల అనారోగ్యంతో మరణించిన ముచ్చర్లకు చెందిన మట్టెడ సారయ్య కుటుంబాన్ని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు వెంకటేశ్వర్‌రెడ్డి చేయూతనిచ్చారు. బుధవారం బాధిత కుటుంబానికి బియ్యంతో పాటు నిత్యావసర వస్తువులు అందించారు.

సమ్మెతో స్తంభించిన పోస్టల్ సేవలు

- తపాలా డివిజన్ కార్యాలయం ఎదుట ఉద్యోగుల ధర్నా



హన్మకొండ : తపాలా డివిజన్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న తపాలా ఉద్యోగులు

హన్మకొండ: గ్రామీణ తపాలా ఉద్యోగుల ఒక్క రోజు సమ్మెతో సేవలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. బుధవారం సమ్మె చేసిన ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి వందలాదిగా గ్రామీణ తపాలా ఉద్యోగులు చేరుకుని హనుమకొండలోని తపాలా డివిజన్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అంతకు ముందు ర్యాలీ నిర్వహించారు. ధర్నానుద్దేశించి అఖిల భారత గ్రామీణ తపాల ఉద్యోగుల సంఘం హనుమకొండ డివిజన్ కార్యదర్శి బొడ్డున వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, తపాలా శాఖ గ్రామీణ ఉద్యోగులపై వివక్ష చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకుండా అన్యాయం చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో గ్రామీణ తపాల ఉద్యోగుల సంఘం సహాయ కార్యదర్శి మర్రి కొమురారెడ్డి, కర్ర యాదవరెడ్డి, ఎస్.మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

మడికొండ: గ్రామీణ డాక్ సేవక్ ఉద్యోగుల పిలుపు మేరకు హనుమకొండ డివిజన్‌లోని మడికొండ సబ్ కార్యాలయంలో జీడీఎస్ సెక్రటరీ సందీప్, కార్యవర్గ సభ్యులు సమ్మెలో పాల్గొని నిరసన తెలిపారు.

ఖిలావరంగల్: తపాలా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం డివిజనల్ చైర్మన్ బి.ప్రభాకర్‌రెడ్డి, కన్వీనర్ జి.రాజేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు.వరంగల్ డివిజన్ తపాలాశాఖ ప్రధాన కార్యాలయం ఎదుట గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ధర్నాను నిర్వహించారు. కార్యక్రమంలో తపాలా శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఫార్మా రంగంలో ఉపాధి అవకాశాలు



హసన్‌పర్తి : మాట్లాడుతున్న తిరుమల్‌రావు

హసన్‌పర్తి : ఫార్మారంగంలో ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు అన్నారు. భీమారంలోని ఎస్‌వీఎస్ కళాశాలలో మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందిన బీ ఫార్మసీ విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం బుధవారం నిర్వహించా రు. సెమినార్ హాల్‌లో జరిగిన కార్యక్రమానికి తి రుమల్‌రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఫార్మా యూనివర్సిటీకి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోందన్నారు. ఔషధ యూనివర్సిటీ వల్ల ఇక్కడికి ఎక్కువ మొత్తంలో పరి శ్రమలు వచ్చే అవకాశాలు ఉన్నాయని వివరించారు. కళాశాలలో ప్రవేశం పొందిన విద్యార్థులకు ప్లేస్‌మెంట్ కల్పిస్తామన్నారు. ముందుగా తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ రంగంలో అనేక అవకాశాలు

హన్మకొండ: ఫార్మసీ రంగంలో అనేక అవకాశాలున్నాయని సెయింట్ పీటర్స్ ఫార్మసీ కళాశాల చైర్మన్ టి.జయపాల్ రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండ విద్యానగర్‌లోని కళాశాలలో జరిగిన పునశ్చరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమాన్ని జయపాల్ రెడ్డి జ్యోతి వెలిగించి మాట్లాడుతూ కళాశాలలో చదివిన విద్యార్థులు దేశ విదేశాల్లో మంచి స్థానాల్లో ఉన్నారన్నారు. విద్యార్థులను తీర్చిదిద్దడానికి వర్క్‌షాపులు, సదస్సులు, సెమినార్‌లు నిర్వహిస్తున్న విషయ పరిజ్ఞానాన్ని పెంపొందిస్తున్నామన్నారు. సదస్సులో ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీ, అధ్యాపకులు రాజశేఖర్, ప్రవీణ్, రాజు, తదితరుల పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు



కాజీపేట : ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

హన్మకొండ: అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని వరంగల్ డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండలోని దీన్‌దయాల్‌నగర్, పోచమ్మకుంటలో పాదయాత్ర నిర్వహించి ఇంటింటికి వెళ్లి ఆరు గ్యారంటీ కార్డులు పంపిణీ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చి సోనియా గాంధీకి బహుమతి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాజీపేట: నగరంలోని 63వ డివిజన్ విద్యానగర్ కాలనీలో బుధవారం కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ అభయహస్తం, ఆరు గ్యారంటీ పథకాల కార్డులను ఇంటింటి వెళ్లి పంపిణీ చేశారు. ఆరూరి సాంబయ్య ఆధ్వర్యంలో కార్యకర్తలు ప్రజలకు కార్డులు అందించి రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పోగుల సంతోష్, పి.ఆంజనేయులు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

సోనియాగాంధీ రుణం తీర్చుకోవాలి

హసన్‌పర్తి: కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకోవాలని కాంగ్రెస్ వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ నమిండ్ల శ్రీనివాస్ అన్నారు. నగరంలోని 1వ డివిజన్ పలివేల్పులలో బుధవారం గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి వరదరాజేశ్వర్‌రావుతో కలిసి ఇంటింటి పథకాలపై ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి, నాయకులు దేవకొండ ఐలేశ్వర్, సుజాత పాల్గొన్నారు.

ప్రభుత్వ సొమ్ము తరలిస్తే తిరుగుబాటు తప్పదు



హన్మకొండ: ప్రభుత్వ ఖజానా సొమ్ము బీఆర్ఎస్ కార్యకర్తల ఖాతాలకు తరలిస్తే తిరుగుబాటు తప్పదని టీఎస్ ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి విజయ్ అన్నారు. బుధవారం హనుమకొండలోని జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళిత బంధు, గృహలక్ష్మి, బీసీ బంధు పథకాల కోసం అందరి దగ్గర దరఖాస్తులు తీసుకోండి...వారిలో వారికి తగాద ముగిసేలోపు ఎన్నికల నోటిఫికేషన్ వస్తుంది...ఈ లోపు పథకాలు అయిపోతాయి అంటూ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు వ్యాఖ్యానించడాన్ని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో నాయకులు ఇల్లందుల భాస్కర్, తాళ్లపల్లి యోబు, పవన్, మధు, వీరన్న, శంకర్, రాజు, విక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల భిక్షాటన



కాజీపేట : భిక్షాటన చేస్తున్న ఆశ వర్కర్లు

హన్మకొండ : తమ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్య వైఖరికి నిరసనగా బుధవారం ఆశ వర్కర్లు హనుమకొండ చౌరస్తాలో దుకాణాదారుల వద్ద భిక్షాటన చేశారు. సంఘం గౌరవ అధ్యక్షుడు రాగుల రమేష్ మాట్లాడారు. తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కాజీపేట: పనికి తగిన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కాజీపేట పట్టణంలో బుధవారం సీఐటీయు నాయకుల ఆధ్వర్యంలో ఆశ వర్కర్లు భిక్షాటన చేశారు. యూనియన్ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, తెలంగాణ ఆశ వర్కర్ల యూనియన్ నాయకురాలు, తదితరులు పాల్గొన్నారు.

మైనర్లు బైక్‌లు నడిపితే నేరం



మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ సుజాత

కాజీపేట: అత్యుత్సాహంతో పిల్లలు ద్విచక్ర వాహనాలను నడపడం నేరమని గుర్తించాలని ట్రాఫిక్ సీఐ కె.సుజాత అన్నారు. కాజీపేట ఫాతిమా నగర్‌లోని బిషప్ బెరెట్ట ఉన్నత పాఠశాలలో బుధవారం సీపీ ఏవీ రంగనాథ్ ఆదేశం మేరకు మైనర్లు వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పోలీసుల తనిఖీల్లో వా హనాలు నడుపుతూ పిల్లలు పట్టుపడితే బాలల జైలుకు వెళ్లాల్సి రావడమే గాక తల్లిదండ్రులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఎస్సై ఆర్.రామారావు, హెచ్‌ఎం జయప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణకే అసోసియేషన్



మాట్లాడుతున్న కృష్ణ కుమార్

హన్మకొండ: మీడియా రంగంలో తమ ఐక్యతను చాటేందుకు...హక్కుల పరిరక్షణే ధ్యేయంగా తెలంగాణ ప్రింట్ మీడియా వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ స్థాపించినట్లు హడ్ కమిటీ ప్రతినిధులు, ప్రింట్ మీడియా జర్నలిస్టులు స్పష్టం చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రం వేదికగా హనుమకొండలో బుధవారం తెలంగాణ ప్రింట్ మీడియా వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆవిర్భావ సన్నాహక సమావేశం జరిగింది. సమావేశంలో జిల్లాలోని వివిధ జర్నలిస్ట్ సంఘాలు, వివిధ పత్రికల్లోని నాయకులు, పాత్రికేయులు హాజరై మీడియా రంగంలో వస్తున్న నూతన పోకడలు ముఖ్యంగా ప్రింట్ మీడియా వర్కింగ్ జర్నలిస్టులు తమ హక్కులు సాధించుకోవడం, ఐక్యతను చాటుకోవడం కోసం తీసుకోవాల్సిన చర్యలపై సుదీర్ఘంగా ప్రసంగించారు. అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ కొల్ల కృష్ణ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కో కన్వీనర్లు కంకణాల సంతోష్, కట్కూరి రవికుమార్, ఊటుకూరు సాయిరాం, బొమ్మగాని ఆదర్శ్‌కుమార్, అల్వాల సదాశివుడు, సీనియర్ జర్నలిస్టులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు. పలు వురు జర్నలిస్టులు మాట్లాడుతూ మీడియా రంగంలో ప్రింట్ మీడియా జర్నలిస్టుల ఉనికి కష్టతరంగా మారుతుందని, ఇలాంటి తరుణంలో ప్రింట్ మీడి యా జర్నలిస్టులు ఐక్యంగా అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు పాటుపడాలని పిలుపునిచ్చారు. నూతనంగా ఆవిర్భవించిన అసోసియేషన్‌కు జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు, జర్నలిస్టులు అభినందనలు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

బ్యానర్లు చించివేయడం దేశ ద్రోహం

ఖిలా వరంగల్: తెలంగాణ అభివృద్ధికి ప్రధాని మోదీ రాష్ట్రానికి వస్తే మొహం చాటేసిన కేసీఆర్ ఫామ్‌హౌస్‌కి పోయి దాక్కోవడం సిగ్గు చేటని, సిద్దిపేటలో పార్టీ కార్యక్రమంలా మోదీ ఫొటోతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని చింపివేయడం దేశ ద్రోహమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుసుమ సతీష్ అన్నారు. మంత్రి హరీష్‌రావు తీరును నిరసిస్తూ బుధవారం వరంగల్-ఖమ్మం శంభునిపేట ప్రధాన రోడ్డుపై తూర్పు బీజేపీ నేతల ఆధ్వర్యంలో హరీష్‌రావు దిష్టిబొమ్మను దహనం చేశారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం ఆహంకారానికి సమాజం తప్పకుండా బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

నేత్రదానం

ఎంజీఎం : మండలంలోని అంబాలకు చెందిన కుమ్మరి రాజకొమురయ్య ఆర్టీసీ డ్రైవర్ పనిచేస్తున్నాడు. విద్యుత్ షాక్‌తో మరణించగా బుధవారం వారి కుటుంబ సభ్యులు భార్య లక్ష్మి, కుమారుడు గణేష్‌లు రాజకొమురయ్య నేత్రాలను దానం చేసేందుకు ముందుకు రాగా తెలంగాణ అవయవ శరీర దాతల అసోసియేషన్ వరంగల్ ఆధ్వర్యంలో వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సిబ్బంది, ఎల్వీ ప్రసాద్ కంటి సేకరణ నిపుణులు అజ్మీర లక్ష్మణ్ ద్వారా నేత్రాలను సేకరించినట్లు తెలంగాణ అవయవ శరీర దాతల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి తెలిపారు. ఎవరైనా అవయవ దానానికి సిద్ధమైతే 8790548706 ఫోన్ చేయాలని కోరారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

కాజీపేట: నగరంలోని 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్‌కాలనీలో వర్ధన్నపేట మండలం ల్యాబర్తి, బొక్కలగూడెం గ్రామాలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన కార్యకర్తలు బుధవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే ఆరూరి రమేష్ కార్యకర్తలకు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీపీ అన్నమనేని అప్పారావు, ఎంపీటీసీ ఉమాదేవి, రవీందర్ రావు, నిరంజన్, కళింగరావు, జి.రాజు తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ సభకు ముమ్మర ఏర్పాట్లు

ఖిలా వరంగల్: ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కె.తారకరామారావు వరంగల్ నగరంలో ఈనెల 6న పర్యటించనున్నారు. తూర్పులో పలు అభివృద్ధి కార్యక్రమాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. ఇందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఖిలావరంగల్ వాకింగ్ గ్రౌండ్‌లో అధి కారులు, ప్రజాప్రతినిధుల సంయుక్త ఆధ్వర్యంలో ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. వేదిక ఏర్పాట్ల పనులను బుధవారం ఆర్డీఓ వాసుచంద్ర, ఏసీపీ బోనాల కిషన్, సీఐ ముస్క శ్రీనివాస్, స్థానిక కార్పొరేటర్లు బైరబోయిన ఉమ, వేల్పుగొండ సువర్ణలతో కలిసి ఎమ్మెల్యే నరేందర్, డీసీపీ బారీ పరిశీ లించారు. ప్రాంగణంలో సుమారు 60వేల మందిపైగా కూర్చునే విధంగా ఏర్పాట్లు చేశారు.

డబుల్ బెడ్రూం ఇళ్ల పరిశీలన

ఖిలా వరంగల్ శివారు దూపకుంట రోడ్డులో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లు అర్హులైన లబ్ధిదారులకు ఐటీ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ఇచ్చేవిధంగా సిద్ధంగా ఉన్నాయి. డబుల్ బెడ్రూం ఇళ్ల ప్రాంగణంతో పాటు పరిసరాలను క్షుణ్ణంగా ఎమ్మెల్యే, డీసీపీ పరిశీలించారు. వారి వెంట మండల తహసీల్దార్ నాగేశ్వరరావు, కార్పొరేటర్లు మరుపల్లి రవి, దిడ్డి కుమారస్వామి, సుంకరి శివ, బీఆర్ఎస్ నేతలు బైరబోయిన దామోదర్, సత్యనారాయణ,సునీల్, శ్రీనివాస్, మోడెం ప్రవీణ్, మండ వెంకన్న ఉన్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఖిలావరంగల్: రూ.4కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇతర అభివృద్ధి పనులకు ఖిలావరంగల్ పెట్రోల్‌బంక్ జంక్షన్ సమీపంలో స్థానిక కార్పొరేటర్ బైరబోయిన ఉమా, దామోదర్‌యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే నరేందర్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూర్పును కనీవినీ ఎరగని రీతిలో అభివృద్ధి చేస్తానన్నారు. అదేవిధంగా 34వ డివిజన్ శివనగర్ వాసవి లేన్‌లో ఆర్యవైశ్యుల వినాయక ట్రస్ట్ భవన మండపానికి స్థానిక కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి, ఆర్య వైశ్య ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే నరేందర్ శంకుస్థాపన చేశారు.

కాశిబుగ్గ : గ్రేటర్ వరంగల్ 20వ డివిజన్‌లో వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ స్థానిక కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్‌తో కలిసి పలు అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. మాజీ కార్పొరేటర్ బయ్యా స్వామి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు ఎండి ఇక్బాల్, పెండ్యాల సోని బాబు తదితరులు పాల్గొన్నారు.

వీపీకే సమాఖ్య చేయూత

కాశిబుగ్గ : తండ్రి లేని పిల్లల చదువులకు వీపీకె సమాఖ్య చేయూతనిచ్చింది. 18వ డివిజన్ లేబర్ కాలనీకి చెందిన వనం రమేష్ రెండు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. దాంతో అతని ఇద్దరు పిల్లలు చదువులకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బుధవారం సమాఖ్య ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ వెంకటరమణ వారి ఇంటికి వెళ్లి ఇద్దరి పిల్లలకు ఒకరికి రూ. 15 వేలు, మరొకరికి రూ. 10 వేల చెక్కును అందజేశారు.

పార్టీ మారే ప్రసక్తే లేదు

కాశిబుగ్గ : కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరినట్లు కొందరు ఫొటోలను సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని అది నమ్మొద్దని కాంగ్రెస్ నాయకుడు, కొండా యువసేన జిల్లా అధ్యక్షుడు రేణుకుంట్ల శివకుమార్ తెలిపారు. బుధవారం ఆయన టీపీసీసీ ప్రతినిధి నల్గొండ రమేష్ నివాసంలో మాట్లాడుతూ దళితబంధు, గృహలక్ష్మి పథకాలు అర్హులందరికీ ఇవ్వాలని ఎమ్మెల్యేతో మాట్లాడటానికి మంగళవారం సాయంత్రం ఓ సిటీ క్యాంపు కార్యాలయానికి వెళ్లానన్నారు. ఈ అక్రమంలో కొందరు బీఆర్ఎస్ నాయకులు సరదాగా కండువా కప్పి ఫొటోలు తీసి బుధవారం వాట్సాప్‌లలో వైరల్ చేశారని తెలిపారు.

కేటీఆర్ దమ్ముంటే కేయూలో పర్యటించాలి

హన్మకొండ: వరంగల్ పర్యటనకు వస్తున్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌కు దమ్ముంటే కాకతీయ యూనివర్శిటీలో పర్యటించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి సవాల్ విసిరారు. వరంగల్‌కు ప్రధాని మోదీ ఏమిచ్చారో, మీరేం ఇచ్చారో తేల్చుకునేందుకు చర్చకు సిద్ధమా అని ఆయన ఒక ప్రకటనలో ప్రశ్నించారు. మీ ఎమ్మెల్యేలు చర్చ అంటే పారిపోతున్నారు. మున్సిపల్ మంత్రిగా మీరైనా సిద్ధమా అని ప్రశ్నించారు. బాలసముద్రం వద్ద కట్టి సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్లను అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. వచ్చినప్పుడల్లా ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రాజకీయ ప్రసంగాలు చేస్తున్నారే తప్పా ఓరుగల్లును పట్టి పీడిస్తున్న సమస్యలకు పరిష్కారం చూపడం లేదని తూర్పార బట్టారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుల వంటావార్పు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆవరణలో కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్న అధ్యాపకులు తమ సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలనే లక్ష్యంతో 20 రోజుల నుంచి వివిధ రూపాల్లో నిరసనలు తెలియజేస్తున్నారు. బుధవారం అధ్యాపకులు వంటావార్పు చేసి రోడ్డు మీదనే బైఠాయించి భోజనాలు చేస్తూ నిరసన తెలిపారు. అదేవిధంగా కాంట్రాక్టు లెక్చరర్లు కొందరు విధులు బహిష్కరించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కరీమాబాద్: పరిసరాల పరిశుభ్రతపై గ్రేటర్ పరిధిలోని 42వ డివిజన్ శంభునిపేటలో తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీం లీడర్ జూపాక శివ మాట్లాడుతూ వ్యక్తిగతతో పాటు చుట్టుపక్క ప్రాంతాలను కూడా పరిశుభ్రంగా ఉంచినట్లయితే వ్యాధులను నివారించే అవకాశం ఉంటుందని చెప్పారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడి మృతి

మడికొండ: చికిత్స పొందుతున్న వృద్ధుడు మృతి చెందిన సంఘటన మడికొండలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మడికొండకు చెందిన ఓర్సు పోచయ్య(63) ఇతని భార్య అనా రోగ్యంతో మూడేళ్ల క్రితం మృతి చెందింది. భార్య మృతిని తట్టుకోలేక మానసికంగా బాధపడుతూ తాగుడుకు బానిసయ్యాడు. మంగళవారం ఉద యం ఇంట్లో ఎవరు లేని సమయంలో మద్యం తాగి మత్తులోనే గుర్తుతెలియని పురుగుల మందు తాగి పడిపోయాడు. ఆలకుంట్ల బొందయ్య చూసి ఇంట్లో వారికి ఫోన్‌లో సమచారం అందించగా 108వాహనంలో ఎంజీఎంకు తరలించారు. చికి త్స పొందుతూ మంగళవారం రాత్రి 11 గంటలకు మృతి చెందినట్లు ఎస్సై రాజాబాబు తెలిపారు. మృతుడి కుమారుడు విజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డ్రంకన్‌డ్రైవ్ తనిఖీల్లో 11 మందికి జైలుశిక్ష

కాజీపేట: డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 11 మందికి రెండు రోజుల పాటు జైలుశిక్ష విధిస్తూ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కె.విద్యాసాగర్‌రావు తీర్పునిచ్చారు. సీఐ సుజాత కథనం ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో ప ట్టుబడిన 11 మందిని బుధవారం కోర్టులో హాజ రుపర్చినట్లు తెలిపారు. కిన్నెర రాజేష్, ఒంటెల మల్లికార్జున స్వామి, కందికొండ రాజు, తుకారం సాహెబ్, మనోజు బండారి, గెంటక వెంకట్రావ్, రాజేంద్రప్రసాద్, నెలకంటి సాయిచరణ్, గుగులోతు రాజు, గంధ్ర వెంకట్రావ్‌లకు జైలు శిక్ష, 28 మందికి రూ.49,800 జరిమానా విధించినట్లు వివరించారు.

ప్రతి గ్రామంలో క్రీడామైదానం



స్పోర్ట్స్ కిట్స్ అందజేస్తున్న ఎంపీపీ సునిత

హసన్‌పర్తి : రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించడానికి క్రీడామైదానాలు ఏర్పాటు చేసిందని ఎంపీపీ కేతపాక సునిత అన్నారు. మండలంలోని 15 గ్రామాలకు స్పోర్ట్స్ కిట్స్ అందించారు. మండల పరిషత్ సమావేశపు మందిరంలో జరిగిన కార్యక్రమానికి ఎంపీపీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను వెలికి తీయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం దసరా చీరెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రేణుకుంట్ల సునీత, వైస్ ఎంపీపీ రత్నాకర్ రెడ్డి, ఎంపీడీఓ రామకష్ణ, ఎంపీఓ రవిబాబు, రైతు బంధు సమితి మండల కో-ఆర్డినేటర్ అంచూరి విజయ్, భగవాన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ కిషన్

కరీమాబాద్ : ప్రస్తుత పోటీ ప్రపంచంలో చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని వరంగల్ ఏసీపీ బోనాల కిషన్ అన్నారు. వరంగల్ ఉర్సుగుట్ట తాళ్ల పద్మావతి ఫార్మసీ కళాశాలలో బుధవారం విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం అధ్యక్షతన నూతనంగా ప్రవేశాలు పొందిన విద్యార్థినీవిద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ విద్యార్థి దశ కీలకమని చెబుతూ ఇప్పుడే తమకంటూ ఒక ప్రణాళిక ఏర్పాటు చేసుకుని లక్ష్యం చేరుకునేందుకు కష్టపడి చదవాలని సూచించారు. కార్యక్రమంలో మామునూరు ఏసీపీ సతీష్‌బాబు, మెడికేర్ హాస్పిటల్ డైరెక్టర్ చిన్నపరెడ్డి, మురళీధర్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హైడ్రోథెరపీ యూనిట్ ప్రారంభం

హన్మకొండ అర్బన్ : నగరంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో మానసిక దివ్యాంగులైన చిన్నారులలో మస్తిష్క పక్షవాతం కలిగిన చిన్నారుల అవసర్థాం ప్రతిమ హాస్పిటల్ సహకారంతో నెలకొల్పిన హైడ్రోథెరపి యూనిట్‌ను బుధవారం రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిమ ఫౌండేషన్ ద్వారా చేస్తున్న ఎన్నో రకాల సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ హైడ్రోథెరపీ యూనిట్‌ను నెలకొల్పడం జరిగిందన్నారు. కొంత మంది పిల్లలకు ఆధార్ కార్డు లేక ప్రభుత్వం అందించే పెన్షన్‌ని అందుకోలేకపోతున్నారని కేంద్రం నిర్వాహకులు వినోద్‌కుమార్ దృష్టికి తీసుకురాగా, తక్షణమే అధికారులతో మాట్లాడుతూ పిల్లలందరికీ పెన్షన్ అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో ప్రతిమ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ బోయినపల్లి ప్రతీక్, బాలల పరిరక్షణ సమితి చైర్‌పర్సన్ అనిల్ చందర్‌రావు, నాగవాణి, వసుధ, డీసీపీఓ సంతోష్, మల్లికాంబ నిర్వాహకులు రామలీల, సదానందం,పద్మ, కల్యాణ్,పాల్గొన్నారు.